

సంగారెడ్డిలోని వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవంలో పాల్గొన్న త్రిదండి రామానుజ చిన జీయర్‌స్వామి, ఎమ్మెల్యే చింతాప్రభాకర్

## ఎమ్మెల్యే 'చింతా'కు సన్మానం

సదాశివపేట, డిసెంబర్ 10: సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతాప్రభాకర్ గెలుపొందిన సందర్భంగా కొండాపూర్ మండలంలోని అనంతసాగర్ బీఆర్‌ఎస్ నాయకులు చింతాప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నాయకుడు ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో చింతాప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## శివాజీ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు

రామచంద్రాపురం, డిసెంబర్ 10: ఆర్సీపురం డివిజన్‌లోని రైల్వేట్రాక్ ఏరియాలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ తెలిపారు. ఆదివారం శివాజీ విగ్రహ ఏర్పాటుతో పాటు పార్కు పనులను ఆమె పరిశీలించారు. పార్కు పరిసరాల్లో బల్దియా సిబ్బంది చేత శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్సీపురంలోని యువకుల కోరిక మేరకు శివాజీ విగ్రహాన్ని జాతీయ రహదారికి సమీపంలో ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు. శివాజీ విగ్రహంతో పాటు పార్కుని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నేడు స్థలాన్ని పరిశీలించేందుకు వస్తున్నారని, కమాన్ ఏర్పాటును పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో అశోక్, శ్రీరాములు, నర్సింహ, యాదయ్య, ప్రకాశ్, ఎంఏఖాన్, రాములుయాదవ్, బాలరాజు, సురేశ్, గణేశ్ పాల్గొన్నారు.



ఆర్సీపురంలో శివాజీ విగ్రహ ఏర్పాటు పనులపై చర్చిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

## వీరభద్రస్వామి ఆలయంలో కార్తిక పూజలు

గుమ్మడిదల, డిసెంబర్ 10 : జిల్లాలోని సుప్రసిద్ధశైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో కార్తిక పూజలు వైభవంగా నిర్వహించారు. కార్తిక మాసం చివరి ఆదివారం సెలవు దినం కావడంతో జంటనగరాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చారు. బారులు తీరి వీరభద్రస్వామి వారిని దర్శించుకుని అభిషేకాలు, బిల్వార్చన చేశారు. భద్రకాళీ అమ్మవారి వద్ద కుంకుమార్చన నిర్వహించారు. సత్యనారాయణ స్వామి వ్రత మండపంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలను ఆచరించారు. ఆలయ ప్రాంగణంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు. నందీశ్వరుడి వద్ద భక్తులు కార్తిక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఈవో శశిధర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ సోమయ్య పర్యవేక్షణలో అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. భక్తుల సందడితో ఆలయ ప్రాంగణ శివ నామస్మరణలతో మార్మోగింది.



ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

## అమ్మవారికి మొక్కు చెల్లింపు

సదాశివపేట, డిసెంబర్ 10 : చింతా ప్రభాకర్ ఎమ్మెల్యేగా గెలిస్తే అమ్మవారికి 101 కొబ్బరికాయలు కొడతానని మొక్కిన బీఆర్‌ఎస్ నాయకుడు పంచలింగాల రాజు తన మొక్కు చెల్లించుకున్నాడు. ఆదివారం బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న ఆధ్వర్యంలో రజకకేరిలోని పెద్దమ్మ మందిరంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కును చెల్లించుకున్నాడు.

# ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎదగండి

- ఉత్తరప్రదేశ్ యువతతో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్
- ఐఐటీ హైదరాబాద్‌లో 'యువ సంగం' కార్యక్రమం



హైదరాబాద్‌కు వచ్చిన ఉత్తరప్రదేశ్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

సంగారెడ్డి, డిసెంబర్ 10(నమస్తే తెలంగాణ) : ఉన్నత, సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న యువత భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టికర్తలుగా ఎదగాలని తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్, ఉత్తర్‌ప్రదేశ్ వారణాసిలోని బెనారస్ హిందూ యూనివర్సిటీతో కలిసి 'యువ సంగం' కార్యక్రమం నిర్వహిస్తోంది. 'యువ సంగం' కార్యక్రమంలో భాగంగా తెలంగాణలోని విభిన్న విద్యాలయాల్లో చదువుతున్న యువత ఉత్తరప్రదేశ్‌లో పర్యటించి అక్కడి సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకుంటారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన యువత తెలంగాణలో పర్యటించి ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకుంటారు. ప్రస్తుతం జరుగుతున్న యువ సంగం మూడో విడత కార్యక్రమానికి ఐఐటీ హైదరాబాద్ నోడల్ సెంటర్‌గా పనిచేస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన 42 మంది యువతీ యువకులు యువ సంగం కార్యక్రమంలో భాగంగా తెలంగాణలో వారం రోజుల పాటు పర్యటించారు. యువ సంగం కార్యక్రమం ఆదివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ఉత్తరప్రదేశ్ యువతతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ యువత తెలంగాణలో పర్యటించడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడి సంస్కృతీ సాంప్రదాయాలు తెలుసుకోవటం, పర్యాటక ప్రాంతాలను సందర్శించడం ద్వారా తెలంగాణ గురించి తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు సాంకేతిక అభివృద్ధిలో తెలంగాణలో ముందున్నట్లు చెప్పారు. ఉపాధి కల్పనలో తెలంగాణలో ముందు ఉందన్నారు. తెలంగాణ పర్యాటకం, సంస్కృతీ సంప్రదాయాల గురించి తమ ప్రజలకు తెలియజెప్పాలని ఉత్తరప్రదేశ్ యువతకు గవర్నర్ సూచించారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ యువ సంగం కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.ఈ అవకాశం కల్పించిన కేంద్ర విద్యాశాఖకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యువ సంగం నోడల్ ఆఫీసర్ సౌరబ్ శాండిల్య, ఐఐటీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

**యువ సంగం సాగింది ఇలా**

యువ సంగం కార్యక్రమంలో భాగంగా ఉత్తరప్రదేశ్ యువత తెలంగాణలో పర్యాటకం, సంప్రదాయాలు, అభివృద్ధి, సాంకేతికాభివృద్ధిని పరిశీలించారు.మొదటి రెండు రోజులు ఐఐటీ హైదరాబాద్‌లో గడిపారు.ఈ సందర్భంగా ఐఐటీ హైదరాబాద్‌లో విద్యాబోధన, నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకున్నారు. ఆ తర్వాత మూడోరోజు హైదరాబాద్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, సాలార్ జంగ్ మ్యూజియం తదితర ప్రాంతాలను సందర్శించారు. నాలుగో రోజు గోల్కొండ కోటను సందర్శించారు. తెలంగాణలో నిర్వహించే బతుకమ్మ పండుగ గురించి తెలుసుకున్నారు. ఐదో రోజు యువత హైదరాబాద్ యూనివర్సిటీని సందర్శించారు. ఆ తర్వాత ఐఐటీ హైదరాబాద్‌లోని టెలిస్కోప్ ద్వారా ఖగోల అద్భుతాలను వీక్షించారు. ప్రముఖ కళాకారుడు రమేశ్ చేర్యాల మాస్క్ పెయింటింగ్ గురించి ఉత్తర ప్రదేశ్ యువతకు వివరించారు. ఏడో రోజు ఉత్తర ప్రదేశ్ యువత ఐఐటీ హైదరాబాద్‌లో స్వయం ప్రతిపత్తి వాహనాల తయారీ గురించి తెలుసుకున్నారు.

# విల్లాలు కొని మోసపోయాం

- ప్రభుత్వం న్యాయం చేయాలి
- బీహెచ్‌ఈఎల్ నగ్నార్ సొసైటీ సభ్యుల డిమాండ్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీహెచ్‌ఈఎల్ నగ్నార్ సొసైటీ సభ్యులు

పటాన్‌చెరు, డిసెంబర్ 3 : విల్లాలు కొని మోసపోయామని బీహెచ్‌ఈఎల్ నగ్నార్ మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని ఘనపూర్ గ్రామ పరిధిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రభుత్వం, అధికారులు పట్టించుకుని ఆదుకోవాలని కోరారు. బీహెచ్‌ఈఎల్ నగ్నార్‌లో విల్లాలు నిర్మించి అమ్ముతామని 2018లో టి.రవివర్మ, టి. వెంకటేశ్వర్‌రావు, టి. శ్రీనివాసరావు అనే వ్యక్తులు సొసైటీ ఏర్పాటు చేసి దాదాపు 250మంది సభ్యుల వద్ద భారీగా డబ్బులు వసూలు చేశారన్నారు.

రూ. 94లక్షల్లో విల్లా అందజేస్తామని హామీనిచ్చి తమ వద్ద సగం డబ్బులు అప్పుడే తీసుకున్నారని పేర్కొన్నారు. మధ్యలో జీ ప్లస్ వన్ కాకుండా జీ ప్లస్ టూ నిర్మిస్తున్నామని, మరో 10లక్షలు పెంచారన్నారు. సొసైటీ తరపున అందరూ మరో పది లక్షలు ఇచ్చేందుకు సిద్ధమయ్యామన్నారు. 2023 మార్చిలో ఈ విల్లాలు పూర్తి చేసి తమకు అందజేయాల్సి ఉండగా సొసైటీని గుప్పిట్లో పెట్టుకున్న రవి వర్మ, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు మొహం చాటేస్తున్నారన్నారు. ఎనిమిది నెలలుగా విల్లాల పని నిలిచిపోయిందన్నారు. ఇప్పటికే తాము రూ. 90లక్షల వరకు ఒక్కొకరము చెల్లించామన్నారు. సైట్‌లో పనులు ప్రారంభించడం లేదన్నారు. 25 ఎకరాల్లో 254 విల్లాస్ నిర్మిస్తామని సొసైటీ ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేశారన్నారు. ఇప్పుడు అక్కడ 21 ఎకరాలకు కుదించి 276 విల్లాలు నిర్మిస్తున్నారన్నారు. ఇప్పుడు చాలా మంది సొసైటీ సభ్యుల స్థలాలను కుదిస్తున్నారన్నారు. సొసైటీని వారి గుప్పిట్లో పెట్టుకుని సభ్యులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యకం చేశారు. సొసైటీ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా ముఖ్యులెవరు కలవడం లేదన్నారు. సొసైటీ మీటింగ్‌లు పెట్టడం లేదన్నారు. సైట్‌లో పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని కోరారు. మా విల్లాలు పూర్తి చేసి డ్రా తీసి సభ్యులకు అందజేసేలా చూడాలని సభ్యులు డిమాండ్ చేశారు. బీహెచ్‌ఈఎల్ నగ్నార్ సొసైటీ ప్రాజెక్టులో మోసం జరుగుతున్నదని బీడీఎల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు వివరించారు. సమావేశంలో పవణ్, సాయిప్రకాశ్, వినోద్, కృష్ణమూర్తి, పోచేశ్, సుధీర్‌వర్మ, వెంకటేశ్ గొల్ల, రమేశ్ పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నారాయణఖేడ్, డిసెంబర్ 10: మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆరు గ్యారెంటీల్లో భాగంగా రెండుగ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెండు రోజుల్లోనే మహిళలకు రాష్ట్రమంతటా ఉచిత బస్సుప్రయాణం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. మహిళా సంక్షేమం దిశగా ప్రభుత్వం కృషి చేయనుందని వెల్లడించారు. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారం రోజుల వరకు ఎలాంటి గుర్తింపుపత్రం చూపించకుండానే ప్రయాణించవచ్చని తెలిపారు.

**ప్రభుత్వ దవాఖానలో చేయూత పథకం ప్రారంభం**

పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందించేందుకు చేయూత పథకం కింద రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా సహాయాన్ని రూ. 10లక్షలకు ప్రభుత్వం శనివారం పెంచిందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ దవాఖానలో ఈ పథకానికి సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ చాంధీబాయి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆనంద్‌స్వరూప్ శెట్కార్, మున్సిపల్ కౌన్సిలర్లు దారం శంకర్, ఎంపీటీసీ శంకర్, ముదిరాజ్ సంఘం తాలుక అధ్యక్షుడు అల్కారి సత్యనారాయణ పాల్గొన్నారు.

## 13న నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం

పటాన్‌చెరు, డిసెంబర్ 10 : ఈ నెల 13న నియోజకవర్గ స్థాయి అభివృద్ధి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి మున్సిపాలిటీల వరకు జరుగుతున్న పనుల పురోగతిపై, నూతనంగా చేపట్టబోయే అభివృద్ధి పనుల రూపకల్పనపై అన్ని విభాగాల అధికారులతో, ప్రజాప్రతినిధులతో చర్చించనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరినీ అభివృద్ధిలో భాగస్వామ్యం చేసేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చింతా ప్రభాకర్ గెలుపుపై దర్గాలో పూజలు

సదాశివపేట, డిసెంబర్ 10 : సంగారెడ్డి ఎమ్మెల్యేగా చింతా ప్రభాకర్ గెలుపుపై పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు ఆదివారం స్థానిక మహబూబ్‌పాషా దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. చింతా ప్రభాకర్ తనయుడు చింతా సాయినాథ్ హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల శివకుమార్, మహమూద్ అలీ, ఎండీ ఇజాజ్, ఎండీ అమీద్, ఎండీ హాజీ, కిరణ్, రవి పాల్గొన్నారు.

## సబ్సిడీ గ్యాస్‌కు కేవైసీ

జిన్నారం, డిసెంబర్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ. 500లకు గ్యాస్ సిలిండర్ అందించేందుకు జిన్నారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్యాస్ కనెక్షన్లకు నర్సాపూర్ సాహితీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వారు ఆదివారం కేవైసీ నిర్వహించారు. గ్యాస్ బుక్‌లతో వచ్చిన వారందరికి ఏజెన్సీ సంస్థ కేవైసీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే గ్యాస్‌ను రూ. 500కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోరబోయిన లావణ్యనరేశ్, నాయకులు నరేందర్ గౌడ్, భాస్కర్, సంజీవ పాల్గొన్నారు.